## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



నిర్వాహకులతో ఆగ్రోస్ కార్పొరేషన్ చైర్మన్ బాల్‌రాజు

బాన్సువాడ, సెప్టెంబర్ 29: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని రాష్ట్ర ఆగ్రోస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ అన్నారు. రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డితో కలిసి బాన్సువాడలోని యోగా సెంటర్‌ను ఆయన ఆదివారం సందర్శించారు. కమలేశ్ పటేల్ 69వ జన్మదినం సందర్భంగా మూడు రోజులుగా నిర్వహించిన మెడిటేషన్ కార్యక్రమం ఆదివారంతో ముగియగా.. చివరి రోజు ఆధ్యాత్మిక ప్రవచనాలు వినిపించారు. ధ్యాన కేంద్రాన్ని ఉపాధ్యాయుడు మంత్రి మధుసూదన్, శ్రీదేవి ఏడాది కాలంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు కుషాల్, జిల్లా కార్యదర్శి పద్మ శ్రీనివాస్, వెంకటరమణ, దేవేందర్, రాధాకృష్ణ, బీర్కూర్ నవీన్, నాగరా జు, రాములు, డాక్టర్ రత్నం తదితరులు పాల్గొన్నారు.

***సేవలు అభినందనీయం..***

ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుడు బాల్‌రాజ్ సేవలు అభినందనీయమని రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఆగ్రోస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ అన్నారు. బాల్‌రాజ్ ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని బాన్సువాడలో ఆదివారం నిర్వహించగా.. వారు ముఖ్య అతిథులుగా పాల్గొని బాల్‌రాజ్ దంపతులను సన్మానించారు.

## విరాళం అందజేత

కామారెడ్డి,సెప్టెంబర్ 29: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లిలో నిర్మిస్తున్న మల్లికార్జున స్వామి కల్యాణ మండపానికి మాదిగ కుల సంక్షేమ సంఘం తరపున 11,116 రూపాయల విరాళాన్ని ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు స్వామి, ఉపాధ్యక్షుడు రాజుపాటిల్, కార్యదర్శి నవీన్, ప్రతినిధులు గంగారాం, బాలయ్య, మాదిగ కుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు దండు లింగం, సభ్యులు రాజలింగం, శ్రీనివాస్, బోడోళ్ల రాజయ్య, ప్రవీణ్, సాయిలు, రాములు, నర్సింహులు, చిన్న నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



బిచ్కుంద మీదుగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లు(ఫైల్)

# క్వారీల మూత.. ఇసుక ఎత్తిపోత

**రెచ్చిపోతున్న ఇసుకాసురులు**
**చోద్యం చూస్తున్న అధికారులు**
**ప్రభుత్వ ఆదాయానికి గండి**
**ట్రాక్టర్లతో డంపు.. టిప్పర్లతో జంపు**

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

బిచ్కుంద, సెప్టెంబర్ 29: మండలంలోని మంజీరా నదిలో ఉన్న ఇసుక క్వారీలు మూతపడి నెలలు గడుస్తున్నది. అయినా ఇసుక రవాణా మాత్రం జోరుగానే సాగుతున్నది. ఇసుకను పలువురు అక్రమంగా రవాణా చేస్తున్నారు. మండలం నుంచి మహారాష్ట్ర, కర్ణాటక, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు ఇసుకను తరలిస్తున్నా.. అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తున్నది. మండలంలోని హస్గుల్, శెట్లూర్, ఖత్‌గావ్, పుల్కల్ గ్రామాల శివారులో ఉన్న మంజీరా పరీవాహక ప్రాంతాల నుంచి నిత్యం వందల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. మద్నూర్ మండలంలోని సుల్తాన్‌పేట్, రుషేగావ్ శివారుల్లో ఉన్న గుట్ట ప్రాంతాల్లో ఇసుకను డంప్ చేస్తున్నారు.

రాత్రి సమయంలో లారీలు, టిప్పర్ల ద్వారా మహారాష్ట్ర, ఔరాద్, బీదర్, హానేగావ్, కర్ణాటక తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఒక్కో గ్రామంలో 40 నుంచి 50 వరకు ట్రాక్టర్లు ఉన్నాయి. వాటి ద్వారా ఇసుకను రవాణా చేసి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. శెట్లూర్, హస్గుల్, పుల్కల్ గ్రామాల్లో కొందరు ముఠాగా ఏర్పడి, అధికారులకు మామూళ్లను ముట్టజెప్పి, తమ అక్రమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. అవసరం ఉన్న ప్రదేశాల్లో నాయకుల పేర్లు చెప్పి తప్పించుకుంటున్నారు. ఒక్కో టిప్పర్‌ను 60 వేల నుంచి 70వేల రూపాయల వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

### నామమాత్రంగా దాడులు..

పత్రికల్లో వచ్చిన సమయంలో అధికారులు నామమాత్రంగా దాడులు చేస్తున్నారు. పోలీసు, రెవెన్యూ అధికారులు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వాహనాలను పట్టుకొని, ఎంతో కొంత జరిమానా విధించి చేతులు దులుపుకొంటున్నారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించినా.. ఫలితం మాత్రం కనిపించడం లేదు. అడిషనల్ కలెక్టర్, బాన్సువాడ సబ్ కలెక్టర్ పలుమార్లు మంజీరా పరీవాహక ప్రాంతాలను సందర్శించి అధికారులకు సూచనలు చేశారు. అయినా ఇసుకాసురుల ఆగడాలు మాత్రం ఆగడం లేదు. ఫిర్యాదులు వచ్చిన సమయంలో అధికారులు ఒక్కో ట్రాక్టర్‌కు రూ.మూడు నుంచి ఐదు వేల జరిమానా విధించి వదిలిపెడుతున్నారు. తాజాగా శనివారం మూడు ఇసుక ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో పోలీసులు వాటిని పట్టుకున్నారు. అంతలోనే ఓ నాయకుడు ఎస్సైకి ఫోన్ చేసి ఇసుకను గుడి నిర్మాణం కోసం తరలిస్తున్నట్లు తెలిపాడు. దీంతో వాటిని వదిలివేశారు. రెండు ట్రాక్టర్ల ఇసుకను గుడి వద్ద, ఒక ట్రాక్టర్ ఇసుకను మరో ప్రదేశంలో డంప్ చేసినట్లు సమాచారం. ఇటీవల పోతంగల్ వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న నాలుగు టిప్పర్లు, ఒక లారీని ఫత్లాపూర్ శివారులో పట్టుకున్నారు. ఒక్కో టిప్పర్‌కు రూ.60వేలు జరిమానా విధించగా.. జరిమానా చెల్లించారు. మళ్లీ ఇసుక అక్రమ రవాణా కొనసాగిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. రెండు లేదా అంతకంటే ఎక్కువ పర్యాయాలు ఏదైనా వాహనం పట్టుబడితే సీజ్ చేయాలని కానీ అలా జరగడం లేదని పేర్కొన్నారు. ఈ విషయమై బిచ్కుంద తహసీల్దార్ సురేశ్‌ను వివరణ కోరగా.. తాము ఎవరికీ అనుమతులు ఇవ్వలేదన్నారు. అక్రమ రవాణా విషయం తన దృష్టికి రాలేదని తెలిపారు.



మద్నూర్ మండలం రుషేగావ్ గ్రామ గేటు వద్ద ఇసుక డంప్(ఫైల్)

## శతాధిక వృద్ధుడి మృతి



సాయన్న(ఫైల్)

బిచ్కుంద, సెప్టెంబర్ 29: మండలంలోని పెద్ద దడ్గి గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ నాగ్‌నాథ్ తండ్రి మున్నూరు సాయన్న (108) ఆదివారం ఉదయం మృతిచెందాడు. ఆయన సర్పంచ్‌గా 1971 నుంచి 1982వరకు పనిచేశారని గ్రామస్తులు తెలిపారు. ఆదివారం ని ర్వహించిన ఆయన అంత్యక్రియల్లో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు, బిచ్కుంద పీఠాధిపతి సోమాయప్ప స్వామి పాల్గొన్నారు. మృతదేహంపై పూలమాల ఉంచి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

## ఆంజనేయ స్వామి ఆలయంలో చోరీ





దుండగులు ధ్వంసం చేసిన ఆలయ ద్వారం, తాళం

బిచ్కుంద, సెప్టెంబర్ 29: మండలంలోని మల్కాపూర్ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగిందని స్థానికులు తెలిపారు. గుర్తు తెలియని దుండగులు ఆలయ తాళాలను పగులగొట్టి లోనికి ప్రవేశించారు. సీసీ కెమెరాలను తొలగించి హుండీలోని సుమారు పది వేల రూపాయలను ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం ఆలయానికి వచ్చిన భక్తులు చూసి పూజారికి సమాచారం అందించారు. ఆయన ఆలయానికి చేరుకొని విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై మోహన్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## నేడు అఖిల పక్షం ఆధ్వర్యంలో గాంధారిలో మహాధర్నా

**కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ..**

గాంధారి, సెప్టెంబర్ 29: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ గాంధారిలో సోమవారం అఖిల పక్షం ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించనున్నట్లు అఖిలపక్షం నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ధర్నాకు ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ హాజరవుతారని పేర్కొన్నారు. మండలంలోని అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు, రైతులు ధర్నాకు హాజరు కావాలని కోరారు.

## చుక్కాపూర్‌లో భక్తుల సందడి

మాచారెడ్డి, సెప్టెంబర్ 29: మండలంలోని చుక్కాపూర్ అటవీ ప్రాంతంలో కొలువైన శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా నలుమూలలతో పాటు ఇతర జిల్లాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని ఒడిబియ్యం, వెండి పట్టెనామాలు, కోరమీసాలు, కండ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నూతన వాహనాలకు ప్రత్యేక పూజలు చేయించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ సిబ్బంది తెలిపారు.

## నేడు కాలభైరవస్వామి ఆలయంలో దుకాణాల నిర్వహణకు వేలం

రామారెడ్డి, సెప్టెంబర్ 29: మండలంలోని ఇసన్నపల్లి, రామారెడ్డి గ్రామాల్లో వెలసిన శ్రీకాలభైరవ స్వామి ఆలయంలో కొబ్బరికాయలు, కిరాణం, పూసవేర, పూజా సామగ్రి, లడ్డూ, పులిహోర, వడ ప్రసాదం విక్రయించేందుకు నేడు(సోమవారం) వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ప్రభురాంచంద్రం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 11గంటలకు ఆలయ ప్రాంగణంలో బహిరంగ వేలం ఉంటుందని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనేవారు రూ.పదివేలు డిపాజిట్ చేయాలని సూచించారు. వేలంలో దుకాణాలు పొందిన వారు రెండేండ్లపాటు దుకాణాలను నిర్వహించుకోవచ్చని తెలిపారు.

## బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి

- బీసీ రాష్ట్ర నాయకుడు అర్కల ప్రభాకర్
- కామారెడ్డిలో రౌండ్ టేబుల్ సమావేశం

కామారెడ్డి, సెప్టెంబర్ 29: బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని బీసీ సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కామారెడ్డిలో బీసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర నాయకుడు అర్కల ప్రభాకర్ మాట్లాడుతూ... అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ అని రాహుల్ గాంధీ, సిద్ధరామయ్యతో ప్రకటింపజేసిందని తెలిపారు. రేవంత్‌రెడ్డి బీసీలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్ ఇస్తానని చెప్పారని అన్నారు. ఎన్నికల్లో గెలిచి అధికారం చేపట్టిన అనంతరం ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. వెంటనే బీసీ జనాభా ప్రకారం కుల జనగణన సర్వే చేసి లోకల్ బాడీ ఎలక్షన్లలో 42శాతం రిజర్వేషన్ ఇవ్వాలని, లేదంటే బీసీ జేఏసీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. సమగ్ర కుల సంఘాల వాటా తెచ్చిన అనంతరం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. బీసీ నాయకులు పరశురాం, విఠల్, చిరంజీవులు, రజనీకాంత్, నర్సింహులు, కొమురయ్య, అర్కల్ గంగారాం యాదవ్, మహేశ్, నాగరాజు, సాయి, మల్లేశ్ యాదవ్, రవీందర్ రావు, కాకర్ల ప్రభాకర్, శ్రీనివాస్, నవీన్ యాదవ్, ఎల్లన్న పాల్గొన్నారు



సమావేశంలో పాల్గొన్న నాయకులు

## బోరు ప్రారంభం



బోరు మోటరును ప్రారంభిస్తున్న బల్దియా చైర్‌పర్సన్ ఇందుప్రియ

కామారెడ్డి, సెప్టెంబర్ 29: కామారెడ్డి పట్టణంలోని 15వ వార్డు అశోక్‌నగర్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ ఆదివారం బోర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీవాసులు నీటి సమస్య ఉన్నదని తన దృష్టికి తెచ్చారని, దీంతో బోరు వేయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వనితా రామ్మోహన్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## రెండు గ్రామాల్లో భారతీయ కిసాన్ సంఘ్ కార్యవర్గాలు ఎన్నిక

లింగంపేట, సెప్టెంబర్ 29: మండలంలోని శెట్పల్లి, అయ్యపల్లి గ్రామాల్లో ఆదివారం భారతీయ కిసాన్ సంఘ్(బీకేఎస్) కార్యవర్గాలను ఎన్నుకున్నట్లు సీజీఆర్ఎఫ్ సభ్యుడు రాజాగౌడ్ తెలిపారు. శెట్పల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా అంజాగౌడ్, ఉపాధ్యక్షులుగా వడ్ల భూపాల్, సుర్ణ భూమేశ్, రాజు, ప్రధానకార్యదర్శిగా అట్టెం అశోక్, సహాయకార్యదర్శిగా దుర్గయ్య, సలహాదారులుగా సంగం, టీక్యా, లింగం, నాగభూషణం, మల్లయ్య, రామాగౌడ్, కిష్టాగౌడ్, అట్టెం శ్రీనివాస్, సుభాష్, లక్ష్మారెడ్డి, ఉదయ్ గౌడ్ ఎన్నికయ్యారని అన్నారు. అయ్యపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా చల్ల ఆనంద్, ఉపాధ్యక్షుడిగా విఠల్, ప్రధాన కార్యదర్శిగా అనిల్, సహాయ కార్యదర్శిగా పర్వయ్య, సలహాదారులుగా సుధాకర్, మల్లయ్య, సాయిలు, శంకరప్ప, గోపాల్, ఆదిరెడ్డి, నారాయణ, కాశీరాం, భాస్కర్, మల్లయ్య, బాలమల్లు, భాగయ్యను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



శెట్పల్లి గ్రామ భారతీయ కిసాన్ సంఘ్ నూతన కార్యవర్గ సభ్యులు

## కవికి సన్మానం




కవిని సన్మానిస్తున్న సామాజిక సమరసతా వేదిక బాధ్యులు

కామారెడ్డి, సెప్టెంబర్ 29: గుర్రం జాషువ, బోయి భీమన్న, చిలకమర్తి లక్ష్మీనరసింహం జయంతిలను పురస్కరించుకొని కామారెడ్డిలోని వశిష్ఠ డిగ్రీ కళాశాలలో సామాజిక సమరసతా వేదిక ఆధ్వర్యంలో ఆదివారం కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కవులు తమ కవితలను వినిపించారు. అనంతరం కవులకు శాలువాలు కప్పి, సర్టిఫికెట్లు, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో సామాజిక సమరసతా వేదిక ప్రతినిధులు తుమ్మ రాంచంద్రం, బాల్‌రాజ్‌గౌడ్, అవధాని అంజయ్య, అమృతా రాజేందర్, కవి శేషారావు తదితరులు పాల్గొన్నారు.

## నిజాంసాగర్ ప్రాజెక్టు రెండు గేట్ల ద్వారా నీటి విడుదల



నిజాంసాగర్, సెప్టెంబర్ 29: నిజాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి వరద కొనసాగుతున్నది. దీంతో ప్రాజెక్టు రెండు గేట్ల ద్వారా దిగువకు 11వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు ఏఈ శివప్రసాద్ ఆదివారం తెలిపారు. ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 12వేల క్యూసెక్కుల నీరు వస్తున్నదన్నారు. ప్రాజెక్టు ప్రధాన కాలువలోకి వెయ్యి క్యూసెక్కులు విడుదల చేస్తున్నామని చెప్పారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405.00 అడుగులు (17.802టీఎంసీలు) కాగా ప్రస్తుతం పూర్తిస్థాయి నీటి నిల్వ ఉన్నట్లు తెలిపారు. వచ్చిన నీటిని అదే మొత్తంలో దిగువకు వదులుతున్నామన్నారు.

## మొక్కలను కాపాడండి సారు..!

గాంధారి, సెప్టెంబర్ 29: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఉన్న డివైడర్ల మధ్యలో ఆగస్టు నెలలో అధికారులు మొక్కలను నాటించారు. నాటిన మొక్కలకు ట్రీ గార్డులు ఏర్పాటు చేసినప్పటికీ.. మేకలు మొక్కలను యథేచ్ఛగా మేస్తున్నాయి. గ్రామంలో కొందరు పెంచుకుంటున్న మేకలను రోడ్లపైకి వదిలివేస్తున్నారు. దీంతో అవి రోడ్డు మధ్యలో ఉన్న పచ్చని మొక్కలను మేస్తున్నాయి. గ్రామంలోని ఇంటి పరిసరాల్లో పెంచుతున్న కూరగాయలు, పండ్లు, పూల మొక్కలను కూడా మేకలు నాశనం చేస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. మేకలను రోడ్డుపైకి వదలకుండా యజమానులపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు పంచాయతీ అధికారులకు తెలిపినా.. పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మేకలను రోడ్లపైకి వదిలివేసే వారిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



డివైడర్‌పై ఉన్న మొక్కలను తింటున్న మేకలు

## విత్తనశుద్ధి ప్రాముఖ్యతపై రైతులకు అవగాహన

రామారెడ్డి, సెప్టెంబర్ 29: మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామ రైతులకు విత్తనశుద్ధిపై ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం విద్యార్థులు ఆదివారం అవగాహన కల్పించారు. విత్తన శుద్ధి చేసి పంటలను సాగు చేసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని వివరించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మర్రి సదాశివారెడ్డి, డైరెక్టర్ భాస్కర్, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు అశోక్, రైతులు శ్రీనివాస్, సాయాగౌడ్, జగన్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, రాజేశ్, జీర్ల మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.



అడ్లూర్ ఎల్లారెడ్డిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం విద్యార్థులు

## డంపింగ్ యార్డులో బయో మైనింగ్

బాన్సువాడ టౌన్, సెప్టెంబర్ 29: బాన్సువాడలోని డంపింగ్ యార్డులో బయో మైనింగ్ ప్రక్రియను మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రక్రియ ద్వారా డంపింగ్ యార్డులో ఉన్న చెత్త నుంచి ముడి పదార్థాలను వేరుచేసి ఇతర వస్తువులను తయారు చేయడానికి అనుకూలంగా మార్చుతారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అందె రాజు, కనుకుంట్ల రాజు, మున్సిపల్ ఫీల్డ్ అధికారి హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

## ఏఎంసీ పాలకవర్గానికి సన్మానం



ఏఎంసీ చైర్‌పర్సన్ రజితారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

లింగంపేట, సెప్టెంబర్29: ఎల్లారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గానికి లింగంపేట మండల కాంగ్రెస్ నాయకులు ఆదివారం సన్మానించారు. లింగంపేటలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఏఎంసీ చైర్‌పర్సన్ మారెడ్డి రజితా వెంకట్రాంరెడ్డి, వైస్ చైర్మన్ జొన్నల రాజుతోపాటు డైరెక్టర్లకు శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ దశరథ్‌నాయక్, గౌరవ అధ్యక్షుడు రాంరెడ్డి, లింగంపేట పట్టణ అధ్యక్షుడు ప్రసాద్‌గౌడ్, నాయకులు ఎల్లమయ్య, రఫీక్, కౌడ రవి, గోవింద్, అశోక్, రాజు, ఏదుల్ తదితరులు పాల్గొన్నారు.

## రక్తదాతలు ప్రాణదాతలతో సమానం

**పోల్కంపేటలో రక్తదాన శిబిరం**

లింగంపేట, సెప్టెంబర్29: రక్తదాతలు ప్రాణదాతలతో సమానమని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మండల శాఖ అధ్యక్షుడు బొల్లు శ్రీకాంత్ అన్నారు. మండలంలోని పోల్కంపేట గ్రామంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గ్రామానికి చెందిన యువకులు రక్తదానం చేయడానికి ముందుకు రావడంపై హర్షం వ్యక్తంచేశారు. 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయొచ్చని తెలిపారు. పోల్కంపేటలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 35 యూనిట్ల రక్తాన్ని సేకరించామని తెలిపారు. కార్యక్రమంలో దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు దివిటి రమేశ్, రామానుజాచారి, సంజీవరెడ్డి, సత్యం, రమేశ్, నాగరాజు, మోహన్, నరేశ్ గౌడ్, రాజమౌళి, గ్రామస్తులు మణిగిరి నాగరాజు, నరేశ్, అనిల్, గోవర్ధన్, సిద్ధిరాములు, సునీల్‌గౌడ్, నవీన్, వివేక్, బాన్సువాడ ప్రభుత్వ దవాఖాన బ్లడ్ బ్యాంక్ మెడికల్ అధికారి సాకేత్ వర్మ, పీఆర్వో ఆనంద్, ల్యాబ్ టెక్నీషియన్లు శ్రీనివాస్, ఎబినైజర్, సూర్యకాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకులు

## అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న 2003-04 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

బాన్సువాడ టౌన్, సెప్టెంబర్ 29: బాన్సువాడలోని కోనా బాన్సువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. పాఠశాలలో 2003-04 విద్యా సంవత్సరంలో ఎస్సెస్సీ పూర్తి చేసిన విద్యార్థులు పాఠశాలలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తమ చిన్ననాటి చేష్టలను గుర్తుచేసుకున్నారు. తమకు విద్యా బోధన చేసిన ఉపాధ్యాయులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.